దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

- అందుబాటులోకి వాణిజ్య సముదాయం
- గత ప్రభుత్వ హయాంలో రూ 2.60 కోట్లు విడుదల
- చకచకా ప్రారంభమైన పనులు
- ఎన్నికల నేపథ్యంలో ఆగిన నిర్మాణం
- ఎట్టకేలకు పూర్తి చేసి, ప్రారంభం



లోపల కూరగాయలు విక్రయానికి కేటాయించిన షాపులు



అందుబాటులోకి వచ్చిన వాణిజ్య సముదాయం

భీమునిపట్నం: భీమిలివాసుల దశాబ్దాల కల నెరవేరింది. సరైన మార్కెట్ లేక ఇబ్బంది పడిన వ్యాపారుల, వినియోగదారుల సమస్యలకు తెర పడింది. గత ప్రభుత్వ హయాంలో రూ.2.60 కోట్లు నిధులు మంజూరు చేయడంతో భీమిలిలో వాణిజ్య సముదాయం ఏర్పాటైంది. స్థానిక పెద్దబజారు గంటస్తంభం పక్కన ముందున్న పాత మార్కెట్ స్థానంలో కొత్తగా నిర్మించిన వాణిజ్య సముదాయం ఇటీవలే అందుబాటులోకి వచ్చింది. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధికి ఈ కాంప్లెక్స్ నిదర్శనంగా నిలుస్తోంది.

40 సంవత్సరాల కల

గతంలో ఇక్కడ పెద్దబజారు గంటస్తంభం పక్కన వరుసగా పదిషాపులు, వాటి వెనుక కూరగాయలు, చేపలు, మాంసం మార్కెట్లు ఉండేవి. సుమారు 40 సంవత్సరాల క్రితమే ఇవి దెబ్బతినడంతో వ్యాపారులు ఇబ్బంది పడేవారు. దీంతో అధికారులు కొత్త షాపుల నిర్మాణానికి ఎన్నోసార్లు ప్రతిపాదనలు చేశారు, కానీ కార్యరూపం దాల్చలేదు. పదేళ్లుగా మార్కెట్ బాగా దెబ్బతినడంతో వర్షాలు పడే సమయాల్లో నరకప్రాయంగా ఉండేది. షాపులు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు షాపులను ఖాళీ చేయించి, వాటిని కూల్చివేశారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

ఇక్కడ మార్కెట్ పరిస్థితిని గత ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఏ మాత్రం జాప్యం లేకుండా 2023లో మార్కెట్, షాపులతో కూడుకున్న వాణిజ్య సముదాయం నిర్మాణానికి రూ 2.60కోట్లు నిధులు విడుదల చేసింది. దానిప్రకారం మెయిన్‌రోడ్డు పక్కన విశాలంగా పది షాపుల నిర్మాణం చేపట్టడానికి అధికారులు నిర్ణయించారు. ఇంతకు ముందు రోడ్డును ఆనుకుని షాపులు ఉండడంతో వీటి ముందు వాహనాలు నిలపడం వల్ల, రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వచ్చేది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డుకు బాగా లోపలకు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ఇక లోపల 28 రైతుబజారు తరహా కూరగాయలు, చేపలు, మాంసం విక్రయాలు చేసుకోవడానికి చిన్న షాపుల నిర్మాణం, వాటితోపాటు పార్కింగ్, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పించడానికి నిర్ణయించారు. పనులు కూడా ప్రారంభమై వేగంగా జరుగుతూ వచ్చాయి. మరో ఆరునెలల్లో పనులు పూర్తయ్యే పరిస్థితిలో ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారిపోవడంతో పనులు ఆగిపోయాయి. కొంతకాలానికి మళ్లీ పనులు ప్రారంభమవడంతో ఇటీవల నిర్మాణం పూర్తయింది. దీన్ని ఆరు రోజుల క్రితం ప్రారంభించారు. గత ప్రభుత్వం స్పందించి, నిధులు మంజూరు చేయడంతో షాపింగ్ కాంప్లెక్స్ కల నెరవేరిందని వినియోగదారులు, వ్యాపారులు హర్షం చేస్తున్నారు.



చేపలు, మాంసం విక్రయాలకు కేటాయించిన దుకాణాలు

వేలం ద్వారా షాపుల కేటాయింపు



ఈ వాణిజ్య సముదాయంలో షాపుల కేటాయింపు త్వరలో జరుగుతుంది. వీటిని బహిరంగ వేలం ద్వారా కేటాయింపులు జరుగుతాయి. ముందుగా పత్రిక, ఇతర ప్రకటనల ద్వారా సమాచారాన్ని అందించి, ఆమేరకు వేలం నిర్వహిస్తాం. ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం.

–ఒమ్మి అయ్యప్పనాయుడు, జోనల్ కమిషనర్, భీమిలి

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

వాడవాడలా అందించిన సేవాసంస్థలు, పర్యావరణ ప్రేమికులు



దివీస్ లేబొరేటరీలో..

తగరపువలస: తొలి పూజఅందుకోనున్న గణపతి ప్రజల కష్టాలు గట్టెక్కించాలని కోరుకుంటూ వాడవాడలా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా నాయకురాలు డబ్బీరు ప్రశాంతి సంతపేట అంబేడ్కర్ పాఠశాలలో విద్యార్థులకు మట్టి విగ్రహాలు, వ్రతకల్ప పుస్తకాలు పంపిణీ చేశారు. ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ ఐటీ కళాశాలల ఆధ్వర్యంలో వెయ్యి గణపతి మట్టి విగ్రహాలను విద్యార్థులు, చుట్టుపక్కల గ్రామాలలో పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, సీఎంవో పి.ఎస్. సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులో ఆర్యవైశ్యుల సంఘానికి చెందిన ఉప్పల సాయిరాం, ఆలవిల్లి శ్రీనివారావు, దుర్గా శేఖర్ తదితరులు వెయ్యి విగ్రహాలు పంపిణీ చేశారు.
- వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి 2వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.
- చిప్పాడ దివీస్ లేబొరేటరీలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ సుదర్శన్ చేతుల మీదుగా చుట్టుపక్కల గ్రామాల్లో 6వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. యాజమాన్య ప్రతినిధులు దేవేందర్, ఎల్‌వీ రమణ, వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎ స్.ఎస్.రావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.
- భీమునిపట్నం: భీమిలిలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది. సంఘ కార్యదర్శి మొకర నర్సింగరావు తదితరులు వీటిని అందించారు.
- పద్మనాభం: మండలంలోని మద్దిలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు మూడు వందల మందికి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సింహాద్రి సెల్ పాయింట్ నిర్వాహకుడు కాళ్ల అప్పలనాయుడు వీటిని సమకూర్చారు. రేవిడి జంక్షన్‌లో శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 500 మందికి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు కోన సన్యాసినాయుడు, కార్యదర్శి పద్మనాభస్వామి పాల్గొన్నారు.



సంతపేట అంబేడ్కరు స్కూల్ విద్యార్థులకు మట్టి విగ్రహాలు అందిస్తున్న డబ్బీరు ప్రశాంతి



మట్టి విగ్రహాలు అందిస్తున్న వెంపాడ శ్రీనివాసరెడ్డి



శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీలో..



రేవిడిలో ప్రతిమలను అందిస్తున్న శ్రీనివాస సేవాసంఘం ప్రతినిధులు



వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ..

క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణుడి తిరువీధి ఉత్సవం



మద్దిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని మద్దిలో మంగళవారం శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు ఘనంగా జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఈ నెల 16వ తేదీన మద్దిలో ఈ ప్రతిమను నిలిపారు. ప్రతిమను ప్రతిష్టించి 11 రోజులైన సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. మద్దిలో ప్రారంభమైన ఊరేగింపు పద్మనాభం జంక్షన్ వరకు సాగింది. ఊరేగింపు అనంతరం ఈ ప్రతిమను విజయరాంపురంలోని కె.త్రినాథరావు ఇంటికి తీసుకువెళ్లి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: వినాయకచవితిని భీమిలి నియోజక వర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. గణనాథుని చల్లని చూపులు ప్రజలపై కురిసి, వారి వారి రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ వారు తలపెట్టిన పనుల్లో విఘ్నాలు తొలగిపోవాలన్నారు. పర్యావరణహితంగా పండగను జరుపుకోవాలని సూచించారు.

ఆటోల్లో బ్యాటరీల చోరీ



రాజీవ్‌నగర్‌లో బ్యాటరీ తొలగించిన ఆటో

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి రాజీవ్‌నగర్‌లో దొంగతనాలు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. మొన్నటి వరకు నివాసాల ముందు ఉంచిన ద్విచక్రవాహనాల్లో పెట్రోల్ దొంగిలించేవారు. కానీ నేడు ఆటోలో ఉన్న బ్యాటరీలను సైతం చోరీ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఈ ప్రాంతానికి చెందిన పాపారావు అనే వ్యక్తి ఆటోలో బ్యాటరీని దొంగిలించారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపకరణాలకు 30 మంది దివ్యాంగుల ఎంపిక



హాజరైన దివ్యాంగులు

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో విశాఖపట్నానికి చెందిన ది ఎబిలిటీ పీపుల్ స్వచ్ఛంద సంస్థ ఉపకరణాల కోసం దివ్యాంగుల ఎంపిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించింది. శిబిరానికి 80 మంది దివ్యాంగులు హాజరు కాగా, వీరిలో 30 మందిని గుర్తించారు. వీరికి ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి లీలా ప్రసాద్, ది ఎబిలిటీ పీపుల్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వంశీ పాల్గొన్నారు.

మధురవాడలో అదృశ్యమైన యువతి తిరుపతిలో ప్రత్యక్షం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేటకు చెందిన రేఖ శ్రావణి(19) అనే యువతి ఈ నెల 5న మధురవాడలో అదృశ్యమై మంగళవారం తిరుపతిలో ప్రత్యక్షమైంది. మధురవాడ ల్యాబ్‌లో పని చేస్తున్న శ్రావణి ఇంటి నుంచి విధులకు హాజరైన తరువాత, ఇంటికి రాలేదు. శ్రావణి తల్లి కనక భీమిలి పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మొబైల్ నంబర్ ఆధారంగా ఆమె ఆచూకీని గుర్తించిన పోలీసులు శ్రావణిని తల్లిదండ్రులకు అప్పగించారు.

చవితి వ్యాపారాలకు వర్షం విఘ్నం



రద్దీగా తగరపువలస ప్రధాన రహదారి

సాయంత్రం తెరిపివ్వడంతో కాస్త ఉపశమనం



కిక్కిరిసిన వేములవలస మార్కెట్

తగరపువలస: ఈ ఏడాది వినాయక చవితి వ్యాపారాలకు వర్షం అడ్డంకిగా నిలిచింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది మండపాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. సోమవారం సాయంత్రం నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు పూజాసామగ్రి విక్రయాలపై ప్రభావం చూపించాయి. మంగళవారం ఉదయం నుంచే వర్షం ఏకధాటిగా కురుస్తుండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. మండపాల అలంకరణ కూడా తగ్గించేశారు. దీంతో ఎక్కడికక్కడ మండపాల అలంకరణ సామగ్రి మిగిలిపోయి వ్యాపారులు ఉసూరుమన్నారు. సాయంత్రం 5 గంటలకు వర్షం తెరిపి ఇవ్వడంతో ప్రజలు బయటకు వచ్చారు. దీంతో ప్రధాన రహదారితో పాటు డివైడర్లు కిక్కిరిసిపోయాయి. ఆనందపురం మండలం వేములవలస మార్కెట్ చెరువును తలపించడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. మధురవాడ మార్కెట్‌లోనూ కొనుగోళ్లు అంతంతమాత్రంగానే సాగాయి. యథావిధిగా పూజా సామగ్రి ధరలకు రెక్కలు వచ్చాయి. అరటిపండ్లు, కొబ్బరికాయలు, పత్రి, ఇతర పండ్ల ధరలు చుక్కల్లో ఉన్నాయి. మామిడి కొమ్మలు, అరటి ఆకులు, గరిక వంటివి కూడా కొనుగోలు చేయలేక ప్రజలు ఇబ్బంది పడ్డారు.



డివైడర్‌పై పూజాసామగ్రి విక్రయాలు



మధురవాడ మార్కెట్‌లో అంతంతమాత్రంగా కొనుగోళ్లు

వదలని వాన

- చెరువుల్లా రహదారులు
- చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం



చెరువును తలపిస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ రోడ్డు

మధురవాడ: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మధురవాడ, పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. ఎటూ కాని వర్షంతో ప్రజలు బయటకు రాలేక ఇబ్బంది పడ్డారు.

రహదారులు జలమయం

పీఎం పాలెం: వర్షాలకు పీఎం పాలెం పరిసర ప్రాంతాల్లోని రోడ్లు జలమయమయ్యాయి. హౌసింగ్ బోర్డు కాలనీలోని గుంతల్లో నీరు నిండి, చెరువులను తలపిస్తోంది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్‌హెచ్ కాలనీ, ఆఖరి బస్టాప్, సుగర్ కేన్ లే ఔట్ కాలనీకి వెళ్లే రోడ్డు, హెచ్‌పీసీఎల్ లే ఔట్ తదితర కాలనీలకు వెళ్లే రహదారుల్లోనూ ఇదే పరిస్థితి. అధికారులు స్పందించి, మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వర్షానికి ఏకమైన మధురవాడ డైలీ మార్కెట్ కాల్వలు, రోడ్లు



బంగ్లామెట్ట వద్ద సర్వీస్‌రోడ్డు పైకి జారిపడిన గ్రావెల్

బంగ్లామెట్ట వద్ద రోడ్డుపైకి జారిన గ్రావెల్

తగరపువలస: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఒకటోవార్డు బంగ్లామెట్ట నుంచి సర్వీస్‌రోడ్డుపైకి గ్రావెల్, బండరాళ్లు జారి పడ్డాయి. మంగళవారం ఉదయం పదిన్నర సమయంలో జోరుగా వర్షం కురుస్తుండగా ఒక్కసారిగా రహదారి మీదకు రాళ్లు దొర్లడంతో వాహనదారులు ఆందోళన చెందారు. మెట్టపై నివాసం ఉంటున్న వారు ఏం జరుగుతుందో తెలియక కంగారు పడ్డారు. భీమిలి ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది రహదారిపై పడిన గ్రావెల్, రాళ్లను జేసీబీతో తొలగించి తరలించారు. దీంతో తాత్కాలికంగా ఉపశమనం కలిగినా, భవిష్యత్తులో వర్షాలకు మళ్లీ ఏమైనా జరగవచ్చని బంగ్లామెట్ట, సత్యనారాయణమెట్ట, వెంకటేశ్వరమెట్టపై నివాసం ఉంటున్నవారు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 18న వర్షాలకు కూడా సత్యనారాయణ కొండపై నుంచి గ్రావెల్, బండరాళ్ల మెట్లమార్గంపై పడిన సంగతి తెలిసిందే. వారం రోజుల వ్యవధిలో బంగ్లామెట్ట వద్ద బండరాళ్లు, గ్రావెల్ రహదారిపై పడటం వంటి వరుస సంఘటనలతో వాలు ప్రాంతాలలో నివసిస్తున్నవారు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.



కొమ్మాది జంక్షన్ వద్ద వర్షంలో గొడుగులతో పాట్లు



హౌసింగ్‌బోర్డ్ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

పూల అలంకరణ పోటీలకు ఆహ్వానం



శ్రీరాధా మదన్‌మోహనులు

తగరపువలస: ఈ నెల 31న రాధాష్టమి సందర్భంగా ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద బాల బాలికలు, మహిళలకు వేర్వేరుగా పూల అలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి యదురాజ దాస తెలిపారు. ఈ నెల 30న 12 నుంచి 16 ఏళ్ల బాల బాలికలకు ఉదయం 10 గంటల నుంచి 12 వరకు, 16 ఏళ్ల పైబడిన మహిళలకు ఈ నెల 31న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు పోటీలు నిర్వహిస్తారన్నారు. ఈ అలంకరణ పోటీలు హరేకృష్ణ వైకుంఠం వద్దే ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు వారికి అవసరమైన సహజమైన పువ్వులు, సామగ్రి తెచ్చుకుని పూలదండలు, పుష్పగుచ్ఛాలు మాత్రమే తయారు చేయాలన్నారు. న్యాయనిర్ణేతలు సృజనాత్మకత, పరిశుభ్రత, సహజ పూల వినియోగం, ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.50వేలు, రెండో బహుమతి కింద రూ.40వేలు, మూడో బహుమతి కింద రూ.25వేలు నగదు బహుమతులు రాధాష్టమి రోజున ఇస్తామని తెలియజేశారు. మొదటి సారిగా విశాఖలో జరుగుతున్న ఈ పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 7799006648 నంబరులో సంప్రదించాలని సూచించారు.

150 మందికి వైద్య పరీక్షలు

తగరపువలస: మథర్ థెరిసా 115వ జయంతి సందర్భంగా ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ ఎస్సీ బీసీ కాలనీలో ఆమె చిత్రపటానికి లీడర్ సొసైటీ మంగళవారం నివాళులు అర్పించింది. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ బి.అలేఖ్య 150 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జంగం జోషి, కోన శంకర్, ఉంగరాల ఈశ్వర్, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అలేఖ్య

భీమిలి బీచ్ వద్ద సీపీ పరిశీలన

నిమజ్జనాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఆదేశాలు

భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరగనున్న నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం రాత్రి బీచ్‌ను పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు, లైట్లు పరిశీలించి, నిమజ్జనాల సమయంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, నార్త్ ఏసీపీ అప్పలరాజు, సీఐ తిరుమలరావు ఉన్నారు.



బీచ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ బాగ్చి

భీమిలి జెడ్సీపై చర్యలు తీసుకోవాలి

దళిత నాయకుల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళితనాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు ఆదర్శనగర్‌లో క్లాప్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన డ్రైవర్ ఇంటి శ్రీనుపై అకారణంగా దాడి చేసి, దూషించిన జెడ్సీ అయ్యప్పనాయుడిపై చర్యలు తీసుకోవాలని దళితనాయకులు డిమాండ్ చేశారు. భీమిలి మండలం తాళ్లవలస అంబేడ్కర్ కూడలి వద్ద మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో దళిత నేత గోపాలరావు మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల కనీస వృత్తిపరమైన అవసరాలు తీర్చలేని జెడ్సీ ప్రజల మధ్య దురుసుగా ఎలా ప్రవర్తించగలిగారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆయనపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి, విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోని సన్నిబాబు, సియ్యాద్రి రాంబాబు, యాగాటి రామారావు, బెల్లాన అప్పారావు, బోని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాణేల అలంకరణలో రాస పోలమాంబ



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని 119వ అలంకరణలో భాగంగా మంగళవారం 1, 2, 5, 10, 20 రూపాయల నాణేలు మందారమాల, గజమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన కొలుసు అప్పలరాజు, రోహిణి సహకారం అందించారు.

కబడ్డీ ప్లేయర్ బయోపిక్ 'అర్జున్ చక్రవర్తి'

డాబాగార్డెన్స్: కబడ్డీ క్రీడాకారుడి జీవితం ఆధారంగా రూపొందించిన వాస్తవగాథ 'అర్జున్ చక్రవర్తి' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మంగళవారం నగరంలో ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడింది. అర్జున్ చక్రవర్తి కేవలం ఒక సినిమా కాదు, ఇది నా తొమ్మిదేళ్ల కష్టం. కబడ్డీ చాంపియన్ జీవితంపై దర్శకుడు విక్రాంత్ రుద్ర ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారని హీరో విజయరామరాజు అన్నారు. ఇప్పటికే ఈ సినిమా 46 అంతర్జాతీయ ఫిల్మ్ అవార్డులు గెలుచుకుందని నిర్మాత శ్రీని గుబ్బల అన్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచిందన్నారు. నటుడు దయానంద రెడ్డి (పుష్ప–2 ఫేమ్), హీరోయిన్ సిజా రోజ్, నటుడు దుర్గేష్ తదితరులు మాట్లాడారు.